
# 13

## పలమనేరు బాలాజి



కూర్మాయికి వెళ్ళేందుకు ఆటో మాట్లాడుకున్నాడు.

వంట మాస్టర్ కపాలి వెంట మునిరత్నం, విక్రమ బయలుదేరారు. ఆటలో వంట పాత్రలు, గరిటలు పేర్చుకున్నారు. ఆటోడ్రైవర్‌ది కూడా గడ్డూరే అని మాటలు మధ్యలో తెలిసి విక్రమ అతడితో మాటలు కలిపే ప్రయత్నం చేసాడు.

"నిడిగుంట గుర్రప్ప అంటే గడ్డూర్లో అందరికీ బాగా గురిలేకున్నా, మంచి పేరు తెచ్చుకుని చనిపోయినాడు. కానీ బతికుంటే మాత్రం వచ్చే ఎలక్షన్లలో ఆయప్పే మా గడ్డూరికి పోటీ లేకుండానే సర్పంచి అయిండేవాడు. ఇప్పుడు మీరు ఎలబారిపోతావుండేది ఆయప్ప దినాలుకేగదన్నా" అన్నాడు ఆటోడ్రైవర్ తలతిప్పి విక్రమ వైపు చూస్తూ.

"ఎవురు చనిపోయినారో, ఎవరి దినాలో మాకేం తెలుస్తుంది అబ్బోడా. ఎవురు దినాలు జరిపిస్తారో



# ఆకలేస్తున్నప్పుడు

మాకు వాళ్ళ పేరేకదా తెలిసేది! గద్దూరులో మేంపోవాల్సింది కదిరప్ప వాళ్ళింటికని మాత్రం తెల్సుమాకు. నీపేరే చెప్పలేదే ఇంకా!" వక్కాకు నములుతూ అన్నాడు విక్రమ.

"వెంకటేసన్నా... వెంకీ అంటార్లే".

చీకట్లో ఆటోవేగంగా వెడుతోంది. అప్పటికి సాయంత్రం ఏడు దాటివుంటుంది. అది లగేజీ ఆటో కాదు. పెద్ద ఆటో కూడా కాదు. సులభంగా వెనక సీట్లో ముగ్గురు అతి కష్టం మీద నలుగురు కూర్చోగలిగిన సీటు. దాంట్లో పెద్ద పెద్ద వంటపాత్రలు ఒక దానిలో ఒకటి పేర్చబడి సర్దుకుని వున్నాయి. స్టీలు బక్కెట్లు, గరిటలు, పెనం(బాన్లీ) తదితర వంట సామాగ్రి ఇరుక్కుని వున్నాయి. వీటన్నిటి మధ్య అటూ ఇటూ ముగ్గురు వంట వాళ్ళు సర్దుకుని కూర్చుని వున్నారు.

వెగటు వాసన కలిగించేదాన్ని దేన్నో నోటినిండా పోసుకుని, ప్లాస్టిక్ కాగితాన్ని నలిపి బయట పడేసాడు డ్రైవరు వెంకటేసు.

వున్నట్లుండి సడన్ బ్రేక్‌తో టైర్లు కీచుమన్నాయి. గుడియాత్తం రోడ్డు నుండి కుడివైపుకు సర్రున మలుపు తిరిగింది. ఆ కుదుపుకు ముగ్గురూ ముందుకు తూలి, మళ్ళీ క్షణాల్లో సర్దుకుని తమాయించుకున్నారు.

"ఏం వెంకటేసుబాబు ముందేమన్నా విమానాలు నడిపేవాడివా. ఇష్టంవచ్చినట్లు ఈ పక్కా ఆ పక్కా తిప్పేస్తా వుండావు. కొంచెం కూడా రోడ్డంటే భయమున్నట్లు లేదే నీకు?" మలుపు తిరిగిన రోడ్డువైపు డ్రైవర్ వైపు మార్చి మార్చి చూస్తూ అన్నాడు మునిరత్నం.

ఆ మాటతో కిసుక్కున నవ్వాడు వెంకటేసు. కుడిచేత్తో గడ్డాన్ని అటు ఇటు తిప్పి నెటికలు విరుచుకుని, మెడ సవరించుకున్నాడు. రెండు చేతులూ అట్లా వదిలేసి మళ్ళీ క్షణాల్లో హ్యాండిల్‌ని చేతుల మధ్య బిగించి పట్టుకున్నాడు. ఆటో రయ్యిన దూసుకు వెడుతోంది. ఎదురుగా వచ్చే వాహనాల వాళ్ళు డిమ్ డిప్ కొడుతున్నా, ఆ పని ఆటోడ్రైవర్ చెయ్యకపోవటం గమనించి కపాలి ఏదో మాట్లాడాలని నోరు తెరవబోతుంటే డ్రైవర్ నోట్లోంచి ఈల పాటతో బాటూ బయటకొచ్చేసిందొక మాట.

"ఆటో వెంకటేసంటే ఈ రోడ్డే భయ పడిల్లన్న, అంతే కానీ నాకెవురీ భయమూ లేదన్నా, భయానికే నన్ను చూస్తే భయం తెల్సా." చెనిగి చేల మధ్యలో వెడుతోంది ఆటో. వెంకటేసు వైపు తేరిపారా చూస్తున్నాడు కపాలి.

నూనూగు మీసాల వయసు, సినిమా హీరో ఫోటో ముద్రించిన ముతక రకం బనీను. దాన్నే టీషర్టు అని కూడా అనుకోవాల్సిందే. సిగరెట్లు, బీడీలు తాగిన గుర్తుగా బండబారి పోయిన పెదాలు. ఇష్టం వచ్చినట్లు పెరిగిపోయిన జుట్టు.

"ఎప్పుడైనా పోస్టుమార్టం అంటే ఏమిటో చూసావా వెంకటేసూ?"

ఆటో నడుపుతూనే ఆ ప్రశ్న అడిగిన కపాలి వైపు తలతిప్పి చూసాడు వెంకటేసు. అతడి కళ్ళల్లోని తిరస్కారం, మొహంలోని విసుగు కపాలికి అర్థం అయ్యాయి.

"మావోళ్ళెవరూ అట్లాంటి దరిద్రం చావు చావలేదన్నా. అంత ఘోరాన్ని చూసే ఖర్మ కూడా నాకు పట్టలే." అన్నాడు వెంకటేసు తిరస్కారంగా.

శబ్దం రాకుండా నవ్వాడు కపాలి. మునిరత్నం విక్రమ ఒకర్నొకరు చూసుకున్నారు.

"ఆర్ముగం అని నాకో ఫ్రెండు వుండేవాడులే వెంకటేసు. నీ అంత పలాతన్ మనిషిలే, లారీడ్రైవరు. డ్యూటీ దిగి ఒక రాత్రయినా ఇంటికాడ నిలీకుండా ఎక్స్ట్రా డ్యూటీలకు పోతా వున్నాడు. వాని సంసారం బాధలు అట్లుండెలె! కడాకు ఒక దినం అర్ధరాత్రి వానలో లారీస్కిడ్ అయిపోయి నడిరోడ్లో ప్రాణం యిడిసేసినాడులే. అప్పుడు చూసినా వాన్ని పోస్టుమార్టం చేస్తావుంటే నాకంట్లో నీళ్ళు కాదు వెంకటేసూ రక్తం బయట కొచ్చిందంటే నమ్ము. వాడు ఎట్లాంటి మనిషో తెలుసునా? ఎంత అందగాడో తెలుసునా? వాని ఒడ్డూ పొడవూ అట్లా వుండేది. వాని డ్రైవింగు కూడా జోరుగానే వున్నిందిలే! స్టీరింగు వాడి చేతుల్లో విష్ణు చక్రం మాదిరి గిర్రున తిరగతా వుండె. అట్లాంటోడు... రోడ్డు పొడవునా జిల్లాకో ఆడ మనిషి నా కోసం పడి చస్తుందిరా అని నీలిగినోడు... కడాకు మాంసం ముద్దలాగా మారిపోయి మూట కట్టి... తెస్తావుంటే... ఏందిరా మనిషి జీవితం అని అప్పుడనిపించింది. మనిసి ఎంత బ్రతుకు బతికాడన్నది కాదు. ఎట్లా చచ్చాడన్నది ముఖ్యం. ఆ తాగుడే వాని ప్రాణాలు తీసిందని వాని పెండ్లాం నెత్తీ నోరు కొట్టుకొని యాడిస్తా వుండాది కానీ తాగుడు కాదు... వాని ప్రాణం తీసిండేది.... తాగుడు కాదు... వాని దూకుడు."

నిజానికి ఆటో వేగం తగ్గిందో, లేక తమకు అట్లా అనిపించిందో అర్థం కాక, అర్థం చేసుకునే ప్రయత్నంలో చుట్టు పక్కల పరిసరాల్ని గమనిస్తున్నారు మిగతా ఇద్దరు.

బాట గంగమ్మ గుడి దాటుతోంది ఆటో. చేతులు జోడించి కళ్ళు మూసుకుని నమస్కరించుకున్నాడు విక్రమ. కుడిచేత్తో పెదవుల్ని, ఛాతిని తాకించుకుని పెదాల మధ్యన ఏదో గొణుక్కుంటూ దేవుడ్ని మొక్కుకుంటున్నాడు మునిరత్నం. వెంకటేసు మెల్లగా తలతిప్పి ఓరకంట కపాలి వైపు చూసి తలతిప్పుకున్నాడు. పెదాలు బిగించుకుని తలతిప్పి అడ్డంగా ఊపుతూ ఏదో బూతు పాట అందుకుని, గేరుమార్చి ఉన్నట్టుండి స్పీడు పెంచాడు.

ఆటో కుదుపులకి విక్రమ విసుక్కుంటున్నాడు. "అబ్బోడా ఎందుకంతా జోరు? మనం పోతావుండేది దినాలకు వంట చేసేదానికి. నీ వాలకం చూస్తావుంటే మాకు దినాలు చేసేటట్లుండావు కొంచెం స్పీడు తగ్గించు నీకు పుణ్యం వుంటుంది."

విక్రమ అట్లా అడిగేసరికి వెంకటేసు మొహంలోకి నవ్వొచ్చేసింది. ఏదో సాధించిన వాడిలా మొహం పెట్టాడు. ఈలపాటలో హుషారు పెరిగింది. భుజాల్ని, తలని ఆడిస్తూ ఈల పాటని కూనిరాగంగా మార్చుకున్నాడు.

"మిమ్మల్ని గద్దూరులో వదిలినంక నేను

టౌనుకు రావల్ల కదన్నా ఇంకా రెండు ట్రిప్పులు తోలల్ల, ఊర్లోసేద్యాలు జరక్కపోయేసరికి కరువు పుణ్యమా అని ఉరికాడు ఆటో కొనుక్కుని బతికే మార్గం చూసుకుంటా వుండాడు. మొదట్లో ఆటో నడిపితే జరుగుబాటు అవతా వుండె. ఇప్పుడదీ కనాకష్టమై పోతావుండాది. కాంపిటిషన్ ఎక్కువై పోతావుండాది. డీజిలు రేట్లు పెరిగిపోతా వుండాయి. మాకు సీరియల్ నంబర్లుంటాయి. కదా. మావంతు వచ్చేంత వరకూ కాచుకోనుండల్ల. అయినా రెండు రూపాయలకి బియ్యం తప్పితే ఇంకేమొస్తుంది నువ్వే చెప్పన్నా. తొక్కలో కొత్తిమీరి కూడా కట్ట మూడు రూపాయలు. జోరుగా రెండు మూడు ట్రిప్పులైనా ఎక్స్‌ట్రాగా తోలకపోతే బతుకు బండి నడవదన్నా. అంటూ ఆగిపోయాడు వెంకటేసు... రోడ్డుపైన నడుస్తున్న వ్యక్తిని చూసి మాటలు ఆపేసాడు. చొక్కా జేబులోంచి ప్లాస్టిక్ కవరును కుడిచేత్తో పట్టుకుని పళ్ళసందులో వుంచి కవరు చింపి వెగటు వాసన కలిగిన దాన్నేదో నోట్లో వేసుకున్నాడు.

ఎదురుగా ఎవరో ముసలి వ్యక్తి రోడ్డు పక్కన మెల్లగా నడుస్తు కనిపించాడు. అతడి భుజంపైన ఏదో సంచి బరువుగా వేలాడుతూ వుంది.

"కరువు కాలం కదా, తిండికి దొరికేదే కష్టంగా వుండాది. ఆయప్పదీ గడ్డూరే అన్నా. మునెప్ప అంటారు. దినాము పొద్దన్నే టౌనుకు పోయి సాయంత్రం దాకా తాలుకాపీసు ముందు కూర్చుని యంఆర్ఓ ఆపీసుకు. పోలీస్ స్టేషన్‌కు పోయే వాళ్ళకు అర్జీలు రాసిస్తా వుంటాడు. ఆటోకు దుడ్లు ఎందకు దండగా అని నడిచే పోతా వస్తావుంటాడు. కొడుక్కి పెండ్లయ్యింది. వాడికి తిక్కరేగి దేశాంతరం పోయినాడు. కోడల్ని మనవళ్లని ఈయప్పే సాకుతా వుండాడు. ఈ యప్ప ఆటో బాడుక్కి పాలుమారతాడు కానీ మనవళ్ళని కాన్వెంట్లో చదివిస్తాండాడు. టౌన్లో. భలే పలాతన్ మొత్తానికి" అన్నాడు వెంకటేసు ఏదో ఆలోచిస్తూ.

"వెంకటేసూ కొంచెం ఆటో ఆపు ఆయప్పని రమ్మని చెప్పు" అంటూ వెంకటేసు భుజంపైన చేయి వేసి గట్టిగా నొక్కాడు కపాలి. వెంటనే ఆటో ఆపలేదు వెంకటేసు.

"ఏం నా ఆయప్పకి ఆటో చార్జి ఎట్ల? నువ్విస్తావా?" అని అడిగాడు ఆటో వేగం తగ్గిస్తూ.

"ఇస్తాలే, నువ్వాపు ముందు" అన్నాడు కపాలి నవ్వుతూ.

ఆటో ఆగింది మునెప్ప నడుచుకుంటు ముందుకు వచ్చేసరికి ఆలస్యమవుతుందని రివర్స్‌గేర్ వేసి ఆటోని వెనక్కు నడిపాడు వెంకటేసు.

"కూర్చో మామ దబ్బులొద్దులే. ఈ దినం నీకు ఫ్రీగా లిఫ్ట్ ఇస్తావుండా" కుశాలుగా నవ్వుతూ అన్నాడు వెంకటేసు.

ఆటో లోపలవైపు ఒకసారి పరీక్షగా చూసి



తలవంచి ముందుసీట్లో డ్రైవర్ పక్కనే సర్దుకుని కూర్చున్నాడు మునెప్ప.

"ఏందిరా... ఏపొద్దూ నాకు నీ బండిలో ఊరికే కూర్చోనిచ్చింది లేదు. ఇప్పుడు మాత్రం నువ్వు పిలిచి ఆటో ఎక్కిస్తావుండావంటే ఏదో వుండాది అసలు కథ. ముందు నాతో ఏం పనుండాదో చెప్పు. ఊరికే మామా అని నువ్వంటే నేను నమ్మను." చేతి సంచిని ఒళ్ళో పెట్టుకుని వెనుక కమ్మీని కుడి చేత్తో గట్టిగా పట్టుకుంటా అన్నాడు మునెప్ప.

ఆ మాటకు జవాబుగా కిసుక్కున నవ్వాడు వెంకటేసు "రేపు ఇందిరమ్మ ఇంటికోసం నీకాడికి వస్తావుండా మామా. రేపు మంచి దినం కదా నాకింకా ఇల్లు రాలే. గట్టిగా రాయల్ల అర్జీ. ఈ పార్టీ, ఆ పార్టీ అని ఇద్దరు లీడర్లు మన యంపిటిసి కాడా, సర్పంచు కాడా ఇద్దరి కాడా రెండు మూడు మార్లు అర్జీలు ఇచ్చుండా. వీళ్ళిస్తార్లే అని వాళ్ళు, వాళ్ళిస్తార్లే అని వీళ్ళు అనుకుని కడాకు నాకు ఎవుడూ ఇల్లు ఈనే లేదు. నువ్వుగానా గట్టిగా అర్జీ రాసిచ్చినావంటే ఇల్లు వచ్చేస్తుంది. వచ్చెయ్యల్లంతే."

"ఏమిరా వెంకటేసు, ఇంతకు ముందు నా దగ్గర ఎప్పుడూ అర్జీ రాసుకోలేదే, ఎవురు రాసినారు అర్జీలు అన్నిసార్లు" అశ్చర్యపోయాడు మునెప్ప.

ఆ మాటతో తల గోక్కున్నాడు వెంకటేసు "నీకు అర్జీకి ఐదో పదో ఈయల్ల కద మామ. ఉరికే ఎందుకు దండగ? నేనామాత్రం అర్జీ రాయలేనా అనుకుని నేనే రాసినా మామా."

"అది కదా సంగతి, ఎవుడు చేసే పని వాడే చెయ్యల్ల అబ్బోడా, లేకపోతే పనులు కుదురుగ్గా జరగవు, ఏమంటావన్నా..." తలతిప్పి ఆటోలో వెనుక కూర్చున్న వారి వైపు చూస్తూ అన్నాడు మునెప్ప.

నవ్వుతూ మౌనంగా తలాడించాడు కపాలి. మొహమాటంగా నవ్వారు విక్రమ, మునిరత్నం.

"రేపు దినాలు కదా ఆడికేనా మీరు వస్తా వుండేది" పంట పాత్రలల వైపు చూస్తూ అడిగాడు మునెప్ప.

"అవును మామా ఆడికే. చూడు చూడు... ఎవురు యాడికి పోతా వుండారో, ఎందుకు పోతావుండారో... ఇట్లే కనిపెట్టేస్తివి. ఏమైనా నీ తెలివి ఎవురికి వస్తుంది చెప్పు" తలాడిస్తూ అన్నాడు వెంకటేసు.

వస్తున్న దగ్గును ఆపుకుంటూ మునెప్ప నవ్వుతుంటే పొరబోయింది. కుడిచేత్తో ఆటో కమ్మీని పట్టుకుని ఎడమ చేత్తో తలమీద చరచుకున్నాడు.

"ఏం మామా ఎవురో గట్టిగా తలచుకుంటూ వుండారే నిన్ను. ఉర్లో వాళ్ళేనా? పక్కూరులోనా? టౌన్‌లో వాళ్ళా?"

ఆ మాటకు జవాబుగా ఏదో మాట్లాడబోయే ముందు కొన్ని క్షణాలపాటు మునెప్ప నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"...దేశాంతరం ఎలబారి బోయిండే

నాకొడుకు ఏ సల్లని పొద్దులో అయినా మా నాయిన ఎట్లుండాడో ఏం చేస్తావుండాడో వాని గుండెకాయ పైన నా పెండ్లాం పిలకాయల్ని ఒదిలి పెట్టేసి వొచ్చేసినా కదా. ముసిలోడికి పెండ్లాం కూడా లేదే. ఒక్కడే ఈ వయసులో కూడా కష్టపడాతావుండాడే అని తలచుకుంటా వుండాడేమోరా... ఏదో ఒక పొద్దు నాకొడుకు మళ్ళీ ఈ ఇలాకాలోకి రాకుండానే పోతాడా? నేను సచ్చేలోగా రాకపోయినా.. సచ్చిపోయేప్పుడైనా వస్తాడేమోరా... తలకొరివి పెట్టేదాని కన్నా... వాడు తప్పితే ఈ లోకంలో నన్నింక తలచుకునే దిక్కెవరుండారు చెప్పు నాకు?"

అతడి గొంతు జీరపోయింది. అటు తిరిగి వుండటం వల్ల అతడి మొహంలోని భావాలు ఎవరికీ తెలియడం లేదు. మిగిలిన నలుగురూ ఏమి మాట్లాడే ప్రయత్నం చెయ్యలేకపోయారు.

కొంతసేపటి తర్వాత మనుషుల మధ్య ఏర్పడిన నిశ్శబ్దాన్ని భరించలేనట్లు, సహించలేనట్లు వెంకటేసు వున్నట్లుండి ఏదో ఈలపాట ప్రారంభించాడు.

ఆటోవేగం అది వరకు తగ్గి మళ్ళీ వేగం పుంజుకుంది.

కపాలి ఏదో ఆలోచనలో పడ్డాడు. వెంకటేసు ఈలపాటలో లాలిత్యం లేదు. సొగసు లేదు. అందం లేదు, అయినా ఏమిటో ఏదో స్వాంతనగా అనిపిస్తుంటే కపాలి గొంతు సవరించుకుని ఏదో మాట్లాడబోయి ఎందుకనో మళ్ళీ ఆగిపోయాడు.

మనుషుల మధ్య నిశ్శబ్దంగా కొనసాగుతోంది ఈలపాట వుండిండీ ఆగి సాగుతోంది. విక్రమ, మునిరత్నం- ఇద్దరూ ఒకరిమొహాలు ఒకరు చూసుకుని చెరోవైపు తలలు తిప్పుకుని బయటి చీకట్లను గమనిస్తూండి పోయారు.

"ఎంత మంది రావచ్చంటావు వెంకటేసూ దినాలకి. మంచాయన అంటావుండావు కదా పోయిండేది. చాలామందే వచ్చేట్లుండారే! కదిరప్ప మాత్రం ఏదో సాంగ్యానికి మొక్కుబడిగా చేస్తావుండాం. ఎక్కువ మంది రార్లే. మరీ రుచిగా కూడా చెయ్యద్దు, రుచి ఎక్కువైతే చేసిండేది చాలదు అని చెప్పినాడులే" రేపటి కర్తవ్యం గుర్తొచ్చి యధాలాపంగా అన్నాడు కపాలి.

"పిలిస్తే చాలా మందే వస్తారని, ఎక్కువ ఖర్చయిపోతుందని కదిరప్ప పెద్దగా ఎవ్వరికీ చెప్పలేదులేన్నా. ఊర్లోమాత్రం ఆయప్ప పిలిచినా పిలవక పోయినా వచ్చే జనం వుండరు" అన్నాడు వెంకటేసు.

"అదో..... ఆడ కనిస్తాండాదే అదే మీరు వంట చెయ్యాల్సిన చోటు. తెల్ల చొక్కా వేసుకుని కరెంటుపోలుకింద నిలబడి నవ్వతా మాట్లాగతా వుండాడు చూడు. ఆయప్పే మీక్కావలసిన కదిరప్ప" చెప్పుకొచ్చాడు వెంకటేసు, ఆటోస్పీడు బాగా తగ్గించివేస్తూ.

"సామాన్లు ఎక్కడ దించాలో ముందుగా అడగండి. ఒకసారి అన్నే దించుకుందురు."

వెంకటేసు సూచనతో విక్రమ, కపాలి ఆటో దిగారు. వారిద్దరి కంటే ముందే మునెప్ప ఆటో దిగాడు. ఆ వెనుకే మునిరత్నం కూడా ఆటో దిగి రెండు చేతులూ వెనక్కు చాపి ఒళ్ళు విరుచుకున్నాడు.

"ఆకలేస్తున్నప్పుడు ఎవుడు మాత్రం ఏం చేస్తాడన్నా, ఎన్నగసాట్లు పడి సంపాదిస్తే కూడా కడుపునిండా తినేదానికి తిండి దొరకని కాలమిది. ఇంట్లో జరుగుబాటు లేనప్పుడు, వండేదానికేమీ లేనప్పుడు, వండింది చాలనప్పుడు మనుషులు... ఇట్లా సావులప్పుడు, దినాలప్పుడు, పెండ్లీ దేవరలప్పుడు కడుపు నింపుకుంటారన్నా. కరువు కాలవ కదా రేపు వండేటప్పుడు కొంచెం బియ్యం, బేళ్ళూ ఎక్కువెయ్యన్నా జనం ఆకలి మీదున్నారు."

అక్కడి నుండి కదిలే ముందు మునెప్ప కపాలి వైపు చూస్తూ... ఆ మాటన్నాడు.

# రెక్కలు

## అవనిగడ్డ సూర్యప్రకాష్

ఆకాశం ఆల్చిప్ప
"మేదిని"
మెరుస్తోన్న
ఆణిముత్యమని...
బేహారులచే
బెదద...
× × ×
రాత్రంతా
నగరాన్ని
పహరాకాసే
గూర్ఖావాడు...
ఊరుకాపరి
చంద్రుడు...
అలకలతో అటకెక్కటం
అపార్థాలకు చోటివ్వడం
అర్థం చేసికొనే ఔచిత్యం
కొరవడడం...
గాజు కన్నులో
వెలుగుండదు..
× × ×
పచ్చని పూల చెండులా ఎంచక్కా
అటు వెలుగు ముక్క
ఇటు చీకటి రెక్క
తిరిగే బొంగరం లెక్క...
వియచ్చరుడు
అవనీ తేజుడు...
× × ×
అదేమో మరి
ఒకోసారి అబద్ధం
బతికిస్తూంది
బలి తీస్కుంటుంది...
"అశ్వద్ధామ
హతఃకుంజరః"...
× × ×
రెండు కళ్ళే అయినా
సర్వసృష్టికి సాక్ష్యాలు
ఆనందానికి
నెలవులు...
కాంతి
ద్వారాలు...
× × ×
మానైనా మనిషైనా
మనుగడే ప్రధానం
ఆర్ద్రతైనా సాంద్రతైనా
భావపుష్టే కవితకు మౌలిక గుణం...
వల్మీకం నుంచే
వాల్మీకి...